



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 8,430 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 35,450 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 34,397 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం 43.4506 టీఎంసీల నిల్వ ఉంది.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 589.60 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 81,831 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

న్యూస్‌రీల్

సచివాలయ ఉద్యోగుల నిరసన



బాపట్ల అర్బన్: గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులను వలంటీర్ల విధులు నిర్వహించాలని చెప్పటం సరికాదని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం కొద్దిసేపు నిరసన తెలియజేసి చేశారు. అనంతరం డీఈ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ షేక్ మొహమ్మద్ జానీపాషా, రాష్ట్ర కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులను వలంటీర్ల పనులు చేయించటం సరికాదన్నారు. ఉన్నత విద్య చదువుకుని రెండుసార్లు పరీక్షలు రాసి సర్వీస్‌లోకి వచ్చిన ఉద్యోగులను కించపరిచే విధంగా చూడటం సరికాదన్నారు. ప్రభుత్వం సచివాలయం ఉద్యోగుల విషయంలో వివక్ష చూపటం మానుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర సెక్రటరీ విప్పర్తి నిఖిల్‌కృష్ణ తదితరులు ఉన్నారు.

వెబ్ పోర్టల్‌తో సమాచారం సులభం




అద్దంకి రూరల్: ఆర్టీఐ త్వరలో ప్రారంభించనున్న వెబ్ పోర్టల్‌తో వివిధ శాఖల సమాచారాన్ని సులువుగా పొందవచ్చని రాష్ట్ర ఆర్టీఐ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్. మహబూబ్ బాషా తెలిపారు. శనివారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకర్లతో మాట్లాడారు. 2005లో పార్లమెంటులో బిల్లు ఆమోదంతో ఆర్టీఐ చట్టం ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖ కార్యాలయాల్లో రూ. 10 స్టాంపుతో లెటర్ ద్వారా మనకి కావాల్సిన సమాచారాన్ని 30 రోజుల్లో తీసుకోవచ్చన్నారు. రాబోయే రోజుల్లో ఫోన్‌లోనే యాప్‌ద్వారా సమాచారాన్ని పొందవచ్చని వివరించారు. ఇటువంటి అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సమాచారం కోరే వ్యక్తులు ప్రశ్నలు మాదిరిగా కాకుండా కోరుతున్నట్లు రాసి వారి వద్ద నుంచి సమాచారం పొందాలన్నారు. ప్రజలకు కావాల్సిన సమాచారం అందించేందుకు ఆర్టీఐ సిద్ధంగా ఉందన్నారు.

పవర్ లిఫ్టర్ సాదియాకు ఘన స్వాగతం



విమానాశ్రయం(గన్నవరం): జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్మాస్‌కు శనివారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. కోస్టారికా దేశం శాంజోస్‌లో జరిగిన పోటీల అనంతరం ఆమె హైదరాబాద్ మీదుగా మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో సాదియా అల్మాస్‌కు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, అసోసియేషన్ బాధ్యులు గుమ్మడి వెంకటేశ్వరరావు, భాస్కరరావు, ఎండీ మస్తాన్‌వలి, ఎస్‌కే సుభాని, నరసరావుపేట ఎంఐఎం ఇన్‌చార్జ్ షేక్ మౌలాఅలీ, ముస్లిం చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మాధల నాగుర్, పలు పాఠశాలల విద్యార్థులు స్వాగతం పలికారు. సాదియాతో పాటు ఆమె తండ్రి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి షేక్ సందానిని ఘనంగా సత్కరించారు. అనంతరం సాదియా మీడియాతో మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు, స్పాన్సర్ల ప్రోత్సాహం వల్లే ఈ ఘనతను సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

నృసింహస్వామి ఆలయం నేడు మూసివేత



మంగళగిరి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వారి ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్‌రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు ఉపాలయాలు ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూసి వేయనున్నట్లు ఆలయ ఈవో సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రహణ శుద్ధి అనంతరం సోమవారం ఉదయం 8 గంటల నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్లు తెలిపారు. భక్తులంతా గమనించి సహకరించాలని కోరారు.

గాజుల్లంక పీఏసీఎస్ వద్ద యూరియా కోసం వచ్చిన రైతులను వరుస క్రమంలో నిలబెడుతున్న పోలీసు సిబ్బంది



యూరియా కోసం అగచాట్లు

- వ్యవసాయ శాఖాధికారులు, పీఏసీఎస్ సిబ్బందిపై రైతుల ఆగ్రహం
- పీఏసీఎస్‌లో అధికారుల సమక్షంలోనే అధిక ధర వసూలు

కొల్లూరు: రాష్ట్రంలో యూరియాకు కొరత లేదు.. రైతులు అధైర్య పడవద్దంటూ ప్రభుత్వం చెబుతున్నా మరోపక్క యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పడం లేదు. శనివారం మండలంలోని ఆవులవారిపాలెంలో ఉన్న గాజుల్లంక పీఏసీఎస్‌కు 19.80 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగింది. యూరియాను దక్కించుకునేందుకు రైతులు ఎగబడ్డారు. పీఏసీఎస్‌కు యూరియా వచ్చిన ప్రతిసారీ వచ్చి ఒట్టి చేతులతో తిరిగి వెళ్లడమే మినహా తమ వంతు వచ్చే సరికి యూరియా దక్కడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోని నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి రైతులకు ఇవ్వాల్సిన యూరియాను చాటుమాటుగా నాయకులకు, వారు సిఫార్సు చేసిన వారికి తరలించడం ఎంతవరకు సబబు అని వ్యవసాయశాఖ ఏఓ నరేంద్రబాబు, పీఏసీఎస్ సిబ్బందిని నిలదీశారు. చివరకు వ్యవసాయ శాఖాధికారులు, పీఏసీఎస్ సిబ్బంది పోలీసు సిబ్బంది సాయం కోరి అన్నదాతలను కట్టడి చేయించారు.



కార్యాలయం ముందు బైఠాయించిన రైతులు

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలం మోపర్రు గ్రామంలోని రైతు సేవా కేంద్రం దగ్గర రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. నాట్లు వేసి నెల రోజులు గడిచింది, యూరియా లేకపోవడంతో వరి పైరు పెరుగుదల నిలిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద రైతులు ఇళ్లలో వందల బస్తాలు యూరియా నిల్వ చేసుకోవడం వల్ల కొరత ఏర్పడిందని ఆరోపించారు. ప్రభుత్వం రైతులు, కౌలు రైతులకు యూరియా సకాలంగా అందించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాయడం వల్ల ఈ సమస్య ఏర్పడిదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు చొరవ తీసుకొని అందరికి యూరియా అందించాలని రైతులు కోరారు.

అదనపు వసూళ్లు

యూరియా ప్రభుత్వ నిర్ణీత ధర రూ.266.50 కాగా గాజుల్లంక పీఏసీఎస్‌లో యూరియా పంపిణీ సమయంలో రైతుల నుంచి అదనంగా రూ.33.50 వసూలు చేశారు. దీనిపై పలువురు రైతులు, కౌలు రైతు సంఘం నాయకులు అధికారులను నిలదీశారు.



గాజుల్లంకలో యూరియా కోసం వచ్చిన రైతులు



మోపర్రు రైతు సేవా కేంద్రం వద్ద...

అన్నదాతను మోసం చేస్తున్న చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున
- అద్దంకిలో అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ

అద్దంకి రూరల్: చంద్రబాబు నాయుడు అన్నదాతను మోసం చేస్తున్నాడని రైతు కన్నీరే కూటమి ప్రభుత్వానికి ఉరితాడు అవుతుందని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున అన్నారు. శనివారం అద్దంకిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. నాగార్జున మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు ఎక్కడా ఎరువుల కోసం ఇబ్బంది పడలేదన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్నీ అందజేశామన్నారు. కానీ ఇప్పుడు వ్యవసాయ పనులు ప్రారంభమైతే యూరియా సక్రమంగా అందకపోతే రైతుల గురించి మంత్రులు హేళనగా మాట్లాడుతున్నారన్నారు. రూ.270 యూరియా కట్టను రూ.350 నుంచి రూ.600 వరకు అమ్ముతున్నారంటే ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమన్నారు. మార్క్‌ఫెడ్‌కు ఇవ్వాల్సిన 50 శాతం తగ్గించి ప్రైవేటు వ్యక్తులకు ఎక్కువ శాతం ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో పెట్టుబడికి రూ.13,500, నాణ్యమైన విత్తనాలు అందజేయటమే కాక రూ.300 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామన్నారు. బాపట్ల జిల్లాలో పొగాకు వేసిన రైతుల నుంచి తూతూ మంత్రంగా కొనుగోలు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నావడ్డీ రుణాలు ఇచ్చామన్నారు. చంద్రబాబు ఇప్పటివరకు రైతు భరోసా అందించలేదన్నారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. అద్దంకి పట్టణంలో మహనీయుడు పొట్టి శ్రీరాములు విగ్రహంపై కూడా రాజకీయాలు చేయటం సిగ్గుచేటన్నారు.

9న బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు విజయవంతం చేయాలి

ఈనెల 9న చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను.. యూరియా కోసం, రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా, పొగాకు కొనలేని దుస్థితినిపై ప్రభుత్వాన్ని ఎండగట్టనున్నామని మేరుగు తెలిపారు. బాపట్ల జిల్లాలోని రేపల్లె, చీరాల, బాపట్లలోని ఆర్డీవో కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. అద్దంకి నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు 9వ తేదీ ఉదయం 10 గంటలకు చీరాల వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి సోదరుడు పానెం నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మండల కన్వీనర్లు రైతు విభాగం, వాణిజ్య విభాగం అధ్యక్షుడు, సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేరుగు నాగార్జున, అద్దంకి వైఎస్సార్‌సీపీ నాయకులు

నీలకంఠుడికి జలాభిషేకం



దాచేపల్లి:నీలకంఠేశ్వరస్వామిని తాకుతూ కృష్ణానది ప్రవహిస్తోంది. దాచేపల్లి మండలం కాట్రపాడు వద్ద కృష్ణానది ఒడ్డున నీలకంఠేశ్వరస్వామి విగ్రహాన్ని గత కృష్ణా పుష్కరాల సందర్భంగా డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ విక్రాంత్ కుటుంబ సభ్యు లు ప్రతిష్టించారు. శనివారం నదిలో వరద పెరిగి నీలకంఠేశ్వర విగ్రహాన్ని తాకుతూ నీరు ప్రవహిస్తోంది.

బీచ్ ఫెస్టివల్‌కు అందరు సహకరించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంక బీచ్‌లో బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో శనివారం రియల్ ఎస్టేట్, బంగారు నగల వ్యాపారులు, బీచ్ రిసార్ట్ యాజమాన్యం, రైస్ మిల్లర్స్, పెట్రోల్ బంక్, ఎరువులు, విత్తనాల వ్యాపార సంఘ సభ్యులతో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26, 27, 28 తేదీలలో సూర్యలంక, రామాపురం బీచ్‌లలో ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఫెస్టివల్‌కు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి ఆహ్లాదకర వాతావరణంలో కార్యక్రమాలు తిలకించే విధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సూర్యలంక బీచ్‌లో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు తమ వంతు ఆర్థిక సహాయం అందజేయాలని కలెక్టర్ సంస్థల సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మరాజు, ఎం.ఎం.కొండయ్య, ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డీఎస్‌ఓ అమీర్ బాషా, బాపట్ల, చీరాల ఆర్డీఓలు గ్లోరియా చంద్రశేఖర్, బాపట్ల, చీరాల మున్సిపల్ కమిషనర్లు రఘునాథరెడ్డి, అబ్దుల్ రషీద్, బాపట్ల, చీరాల మండలాల తహసీల్దార్లు సలీమా, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూమి సామర్థ్యం మేరకు యూరియా వాడాలి

సాగు భూమి సామర్థ్యం మేరకు రైతులకు సూచించిన మోతాదులోనే యూరియా వాడాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. యూరియా వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గతేడాది జిల్లాలో 88 వేల హెక్టార్లలో వరి సాగు చేయగా, ప్రస్తుతం 90 వేల హెక్టార్లకు సాగు పెరిగిందన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో 2.24 లక్షల ఎకరాలలో రైతులు వరి సాగు ప్రారంభించినట్లు తెలిపారు. పంటల సాగును దృష్టిలో ఉంచుకుని 20వేల టన్నుల యూరియా అవసరం అని అంచనా వేశామన్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు 21,609 టన్నుల యూరియా జిల్లాకు విడుదల అయిందన్నారు. వాటిని అన్ని గ్రామాలలోని రైతులకు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ ఆధీనంలో 230 టన్నుల యూరియా, డీసీఎంఎస్ వద్ద 500 టన్నులు, సహకార శాఖ వారి వద్ద 530 టన్నులు అందుబాటులో ఉందన్నారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులోనే ఉందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ చెప్పారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే యూరియా వాడాలన్నారు. అధిక మోతాదులో వేస్తే కలిగే నష్టాలను రైతులకు వివరించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, వ్యవసాయశాఖ అధికారి అన్నపూర్ణ, డీసీఓ శ్యాంసన్, మార్క్‌ఫెడ్ జీఎం కరుణశ్రీ, వ్యవసాయ శాఖ ఏడీలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

చీరాల వాసికి అరుదైన అవకాశం

ఢిల్లీ ఎన్‌సీసీ క్యాంపునకు నేతృత్వం వహించనున్న రాజేష్‌బాబు

చీరాలటౌన్: దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 12 వరకు జరగనున్న ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంపునకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్‌లకు ఏఎన్‌ఓ మేడికొండ రాజేష్‌బాబు నాయకత్వం వహించనున్నారు. ఈయన చీరాల వాసి కావడంతో ఎన్‌సీసీ క్యాడెట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 23 ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్‌బాబు చీరాల ప్రసాద్‌నగర్ నివాసి. ఎంబీఏ అసిస్టెంట్ ప్రొఫెసర్‌తోపాటు ఏఎన్‌వోగా నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న రాజేష్‌బాబు ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంపులో ఏపీ, టీజీ రాష్ట్రాల డైరెక్టరేట్‌ల తరపున కాంటిజెంట్ కమాండర్‌గా ఎంపిక చేశారు. చీరాల వీఆర్‌ఎస్ అండ్‌వైఆర్‌ఎన్ కళాశాలలో ఎన్‌సీసీలో శిక్షణ పొందిన ఆయన పలు క్యాంపుల్లో పాల్గొనడంతోపాటు ఎన్‌సీసీ అధికారిగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈనెల 12 వరకు న్యూఢిల్లీలో జరిగే ఏఐటీయూసీ క్యాంపునకు దేశంలోని 17 డైరెక్టరేట్‌లు పాల్గొననున్నాయి. జాతీయ వేదికపై రెండు రాష్ట్రాలకు కాంటిజెంట్ కమాండర్‌గా ఎంపిక చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ అందిస్తున్న ఏఎన్‌ఓ రాజేష్‌బాబు

అనుయాయులకు కట్టబెట్టేందుకే మెడికల్ ప్రైవేటు పరం

- విద్య, వైద్యం పేదలకు అందకుండా చేసేందుకు కుట్ర
- పీపీపీ విధానాన్ని అడ్డుకునేందుకు న్యాయపోరాటానికైనా సిద్ధం
- మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

బాపట్ల: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను చంద్రబాబునాయుడు తన అనుయాయులకు కట్టబెట్టేందుకే పీపీపీ విధానానికి కేబినెట్‌లో అనుమతి తీసుకున్నారని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. దాతల సహకారంతో సేకరించిన స్థలంలో ఇప్పటికే రూ.82 కోట్లు ఖర్చు పెట్టిన బాపట్ల మెడికల్ కళాశాలను పీపీపీ విధానంలో కేటాయిస్తామంటే చూస్తూ ఊరుకునేదిలేదని, అవసరమైతే అందరిన్నీ కూడగట్టుకుని పార్టీలకతీతంగా న్యాయపోరాటానికై నా సిద్ధమని అన్నారు. తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కోన మాట్లాడారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం మొదటి నుంచి విద్య, వైద్యాన్ని పేదవాడికి అందకుండా చేయాలనే కుట్రతోనే ముందుకుపోతుందని అన్నారు. 40 సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబునాయుడు 17 కళాశాలలను ప్రభుత్వ నిర్వహణలో నిర్వహించలేక ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించేందుకు నిర్ణయం తీసుకోవటం బాధాకరమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని మొదటి నుంచి చెప్పటమే కాకుండా చేసి చూపించారని పేర్కొన్నారు. 17 మెడికల్ కళాశాలలకు రూ.8వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే భరించేందుకు సిద్ధంగా ఉండటంతోపాటు 4,5 కళాశాల్లో ఈపాటికే అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. పేదవాడికి నేరుగా వైద్యం అందించేందుకు మెడికల్ కళాశాలలు ఉంటాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. మెడికల్ కళాశాలల విషయంలో 16నెలలపాటు మౌనంగా ఉన్న చంద్రబాబునాయుడు ఒక్కసారిగా పీపీపీ విధానంతో ముందుకు రావటం చూస్తుంటే ఈ 16 నెలలు తనకు సంబంధించిన వ్యక్తులు, వారితో బేరాలు కుదుర్చుకునేందుకే కాలయాపన చేశారని అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, మచ్చా శ్రీనివాసరెడ్డి, తన్నీరు అంకమ్మరావు, జోగి రాజా, ఆడే చందు, ఎస్.శ్రీహరిప్రసాద్, పెద్దపులుగువారిపాలెం శ్రీనివాసరావు, నక్కా వీరారెడ్డి, రెడ్డా రెంకయ్య, అడ్వకేట్ రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

వైభవంగా నవ వినాయకుల నిమజ్జనం



అమరావతి: గుంటూరు, పల్నాడు జిల్లాల సత్యసాయి సేవా సమితుల ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన తొమ్మిది వినాయక విగ్రహాలను శనివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వైభవంగా నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజులుగా గణపతి నవరాత్రోత్సవాలను తొమ్మిది చోట్ల నిర్వహించుకుని అమరావతి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఇలా ప్రతి ఏటా నిర్వహిస్తామని అమరావతి సత్యసాయి సేవా సమితి కో–ఆర్డినేటర్ సీహెచ్ జాజిబాబు తెలిపారు. గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్ ప్రాంగణంలోని సత్యసాయి శాంతిసుధ , గుంటూరు బైపాస్ రోడ్డులోని ఆధ్యాత్మిక సామ్రాజ్యం నుంచి దుగ్గిరాల, తెనాలి, మోదుకూరు, పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, అచ్చంపేట, అమరావతి సాయిబాబా మందిరంలో, త్రిశక్తిపీఠంలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న తొమ్మిది ప్రాంతాలలోని తొమ్మిది విగ్రహాలను తొలుత వైభవంగా ఊరేగించి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

సామాజిక తనిఖీలు వాయిదా

పచ్చనేతల ఒత్తిడితో తనిఖీ నిలిపి వేయాలన్న ఎంపీడీవో, ఉపాధి అధికారులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: సంతమాగులూరు మండలంలో నిర్వహించాల్సిన సోషల్ ఆడిట్‌ను శుక్రవారం వాయిదా వేశారు. పచ్చనేతల ఒత్తిడితోనే ఆడిట్‌ను వాయిదా వేసినట్లు తెలిసింది. సామాజిక తనిఖీ పూర్తిచేయాలని పట్టుబట్టిన ఎస్‌ఆర్‌పీ నాగరాజు ప్రయత్నాలు ఫలించకపోగా సామాజిక తనిఖీని వాయిదా వేయించి డ్వామా జిల్లా అధికారి ఊపిరి పీల్చుకున్నట్లు డ్వామా వర్గాలు చర్చించుకుంటున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో రూ.14.30 కోట్ల పనులు జరగ్గా ఇందులో 70 శాతం అవినీతి జరిగిందని డ్వామా అధికారులే పేర్కొంటుండడం గమనార్హం. సంతమాగులూరు మండలంలో జరిగిన అవినీతిపై మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఉన్న కొందరు పచ్చపార్టీ నేతలతోపాటు జనసేన నేతలు, కార్యకర్తలు పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన జనసేన నేతలు ఉపాధి అవినీతిపై ఆధారాలు సేకరించి కమిషనరేట్ అధికారులకు అందజేశారు. దీంతో సామాజిక తనిఖీ జరిగితే పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉండడంతో ప్రస్తుతానికి సామాజిక తనిఖీ జరగకుండా అడ్డుకునేందుకు పచ్చనేతలు సిద్ధమయ్యారు. ఇందుకోసం సంతమాగులూరు ఎంపీడీవోతోపాటు డ్వామా పీడీపై ఒత్తిడి తీసుకువచ్చారు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు ఎంపీడీవో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సమావేశమై సామాజిక తనిఖీ నిలిపిసేందుకు పన్నాగం పన్ని సామాజిక తనిఖీ వాయిదా వేయాలని లేఖలు రాశారు. అప్పటికే సామాజిక తనిఖీ బృందం మండలానికి రావడంతో ఎలాగైనా అడ్డుకోవాలని పచ్చనేతలు డ్వామా అధికారిపై ఒత్తిడి పెంచారు. ఇందులో భాగంగానే ఏపీవో బాలకృష్ణనాయక్ సెలవులో వెళ్లినట్లు డ్వామా వర్గాల్లో ప్రచారం వుంది. వ్యూహం ఫలించకపోతే ఉపాధి సిబ్బంది మొత్తం వివిధ కారణాలు చూపి సెలవులు పెట్టి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. ఎట్టి పరిస్థితిలోనూ సామాజిక తనిఖీకి అంగీకరించేది లేదని, ఆపడం చేతకాకపోతే సెలవు పెట్టి వెళ్లిపోవాలని నియోజకవర్గ పచ్చనేత డ్వామా అధికారితో పాటు మరో జిల్లా అధికారిపైనా ఒత్తడి తీసుకవచ్చినట్లు సమాచారం. అంతటితో వదలక ఏకంగా పంచాయతీరాజ్ కమిషనరేట్, షాట్ డైరెక్టర్ పైనా ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఎట్టకేలకు సంతమాగులూరు సామాజిక తనిఖీని వాయిదా వేశారు.

క్లుప్తంగా

పచ్చని చెట్లు నరికివేత

- గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య
- డీఎఫ్‌ఓ, పర్యావరణ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయనున్న వార్డు మాజీ కౌన్సిలర్‌



అద్దంకి: అంతర్గత రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసిన సంఘటన పట్టణంలోని 19వ వార్డులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వార్డు మాజీ కౌన్సిలర్‌ బాషా తెలిపిన వివరాల మేరకు.. ఆయన వార్డు కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో కడియం నుంచి రూ.2 లక్షలు వెచ్చించి అంతర్గత రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటించారు. అవి ప్రస్తుతం పెద్ద వృక్షాలుగా మారి స్థానికులకు, పక్షులకు నీడ ఇస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం చూసే సరికి వరుసగా చెట్లన్నీ నరికివేసి ఉన్నాయి. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫారెస్ట్‌ అధికారులకు, గ్రీన్‌ ట్రిబ్యునల్‌, పర్యావరణ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాషా తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



వేటపాలెం: ఇంటి నుంచి ఆడుకోవడానికి బయటకు వెళ్లి తప్పిపోయిన బాలుడిని క్షేమంగా వారి తల్లిదండ్రులకు ఎస్సై జనార్దన్‌ అప్పగించారు. స్థానిక నవజ్యోతి కాలనీకి చెందిన శ్రీను, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రైల్వే స్టేషన్‌ పరిసరాల్లో తిరుగుతున్నాడు. అయితే బాలుడు.. ఇంటికి వెళ్లే మార్గం మర్చిపోయాడు. విషయం తెలుసుకున్న మహిళా కానిస్టేబుల్‌ చిన్నారిని.. పోలీస్‌ స్టేషన్‌కి తీసుకొచ్చారు. స్థానికంగా పోలీస్‌ గ్రూపుల్లో బాలుడి ఫొటో పెట్టి సమాచారం తెలియజేయాలని సూచించారు. అది చూసిన పిల్లవాడి తల్లి తండ్రులు పోలీస్‌ స్టేషన్‌కి చేరుకోవడంతో ఎస్సై జనానర్దన్‌.. బాలుని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. సమాచారం చేరవేసిన మహిళా కానిస్టేబుల్‌ను ఎస్సై అభినందించారు.

కూటమి పాలనలో రైతులకు అడుగడుగునా కష్టాలే !

- వైఎస్సార్‌ సీపీ కన్వీనర్లు డాక్టర్‌ గణేష్‌, అశోక్‌బాబు
- 9న జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

చెరుకుపల్లి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో రైతాంగాన్ని నానా ఇబ్బందులకు గురి చేస్తూ వారిపై నిర్లక్ష్యాన్ని చూపుతోందని వైఎస్సార్‌ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్‌ ఈవూరి గణేష్‌, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. మండలంలోని గుళ్లపల్లిలోని డాక్టర్‌ గణేష్‌ క్యాంపు కార్యాలయంలో శనివారం వైఎస్సార్‌ సీపీ పిలుపు మేరకు ఎరువులు బ్లాక్‌ మార్కెట్‌పై రైతన్నకు బాసటగా అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెండు నియోజక వర్గాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్‌ గణేష్‌ మాట్లాడుతూ వ్యవసాయం దండగ అని భావించే ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో మరో మారు రైతాంగం కష్టాలు పడుతోందని తెలిపారు. ఖరీఫ్‌ సాగుకు సకాలంలో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గణేష్‌, అశోక్‌బాబు తదితరులు

యూరియా అందించక పోవటం శోచనీయమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పట్టించుకోవటం లేదని, అధికారంలోకి రాకముందు రైతే రాజు, రైతు లేనిదే రాజ్యం లేదని ప్రగల్భాలు పలికారని గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని గణేష్‌ విమర్శించారు. జగనన్న పాలనలో రైతులకు కష్టం తెలియకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని ప్రయోజనాలు చేకూర్చారని తెలిపారు. వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు మాట్లాడుతూ గత వైఎస్సార్‌ సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందించడంతో పాటు పంటలకు కూడా గిట్టుబాటు ధర కల్పించిన రైతు పక్షపాతి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు కనీసం యూరియా అందించటంలో ఘోరంగా విఫలమైనట్లు విమర్శించారు. మండలాలకు వచ్చిన యూరియాను కూటమి నాయకులు బ్లాక్‌ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని అశోక్‌బాబు ఆరోపించారు. రైతుల సమస్యలను లెక్కచేయని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు వైఎస్సార్‌ సీపీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఈ నెల 9న రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వనున్నట్లు గణేష్‌, అశోక్‌బాబు తెలిపారు. అన్నదాత పోరు కార్యక్రమంలో రెండు నియోజక వర్గాల్లోని రైతులు, కౌలు రైతులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యదర్శి అంజని ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్‌, చిత్రాల ఒబేదు, రేపల్లె మండల కన్వీనర్లు దుండి వెంకట రామిరెడ్డి, ఇంకొల్లు రామకృష్ణ, శేషగిరి, వేమూరు మండల కన్వీనర్‌ దాది సుబ్బారావు, కొల్లూరు మండల అధ్యక్షుడు సుబ్లేశ్వరరావు, రైతు విభాగం అధ్యక్షుడు గోపాళం రాము, నాయకులు నిజాంపట్నం కోటేశ్వరరావు, లుక్కా బాపనయ్య, అహరోన్‌ పాల్‌, కర్రి వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చైల్డ్‌ కేర్‌ లీవ్‌లను అమలు చేయాలి



బాపట్ల అర్బన్‌: మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన చైల్డ్‌ కేర్‌ లీవులను అమలు చేయాలని జిల్లా జేఏసీ చైర్మన్‌ సురేష్‌ బాబు కోరారు. మహిళా విభాగం ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కలెక్టరేట్‌లో జేసీ గంగాధర్‌గౌడ్‌ ఆధ్వర్యంలో కేక్‌ కటింగ్‌ చేశారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్‌ సురేష్‌ బాబు మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం కేటాయించిన సెలవులను అమలు చేయాలని కోరారు. పెండింగ్‌ డీఏలను ఇవ్వడంతో పాటు పీఆర్సీను వెంటనే ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం నాయకులు కె.రజని, హాజర బేగం పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

మార్టూరు: అటవీ ప్రాంతంలోని వన్య ప్రాణులను ఎవరైనా వేటాడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని కూకట్లపల్లి రేంజ్‌ ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ రమేష్‌ బాబు హెచ్చరించారు. మండలంలోని బబ్బేపల్లి, రాజుగారి పాలెం గ్రామాల పరిధిలోని స్థానికులతో ఆయన శనివారం మాట్లాడారు. ఈ రెండు గ్రామాల పరిధిలో వ్యాపించి ఉన్న కొండ అటవీ శాఖ ఆధీనంలో ఉన్నందున భూభాగంలో సంచరించే వన్య ప్రాణులను అభివృద్ధి చేయడం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు గ్రామాల మధ్య అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీ ప్రారంభించామని అందులో టేకు, వేప, జామ, మద్ది, వెదురు తదితర 15 రకాల మొక్కలను ఈ సంవత్సరం పెంచుతున్నామని త్వరలో రైతులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మొక్కలను కొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో నాటడం ద్వారా అడవిని అభివృద్ధి చేసి పర్యావరణానికి తోడ్పడడంతో పాటు వన్యప్రాణులను అభివృద్ధి చేయటం తమ ఉద్దేశమని ఆయన తెలిపారు. అటవీ భూభాగంలో అడవి పందులను, కుందేళ్ళను, లేళ్ళు, జింకలు, ఇతర పక్షులను వేటాడటం నిషేధమని నిబంధనలు అతిక్రమించిన వారిపై వన్య ప్రాణుల సంర



రాజుగారి పాలెంలోని గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ రమేష్‌ బాబు

క్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కొండ భూభాగం గతంలో రెవెన్యూ పరిధిలో ఉన్నదన్న అపోహతో కొందరు ఇష్టా రాజ్యంగా గ్రావెల్‌ తవ్వకాలు నిర్వహించారని ప్రస్తుతం అటవీ శాఖ ఆధీనంలో ఉన్న ఈ భూమిలో అలాంటి అరాచక చర్యలు పూర్తిగా నిషేధమని తెలిపారు. అటవీ భూమిని ఎవరైనా ఆక్రమించినా, నకిలీ పట్టాలు, ధ్రువపత్రాలు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన రెండు గ్రామాల పరిధిలోని వన్యప్రాణులను వేటాడే సంచార తెగలకు చెందిన వారికి కౌన్సెలింగ్‌ ఇచ్చి అవగాహన కల్పించారు.

అదుపులోకి ‘తురకపాలెం’ పరిస్థితులు

గుంటూరు రూరల్‌: తురకపాలెం గ్రామంలో పరిస్థితులు పూర్తి స్థాయిలో అదుపులో ఉన్నాయని, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిరంతరం వైద్య ఆరోగ్య ఇతర సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్‌ ఎస్‌ నాగలక్ష్మి తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు 895 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 2,850 మందికి ఉపాహారం, 3500 మందికి మధ్యాహ్న భోజనం అందించామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ ఆధ్వర్యంలో ట్యాంకర్స్‌ ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిన శబరీ ఎక్స్‌ప్రెస్‌



బాపట్ల: సికింద్రాబాద్‌ నుంచి తిరువనంతపురం వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్‌ రైలు సాంకేతిక లోపంతో బాపట్లలో అర గంటకు పైగా నిలిచిపోయింది. బాపట్ల స్టేషన్‌లో రైలు నిలిచిపోవటంతో ప్రయాణికులు కొద్దిసేపు కంగారుపడ్డారు. ఇంజనీరింగ్‌ అధికారులు సాంకేతిక లోపాన్ని సరిచేసి అరగంట ఆలస్యంగా నడిపారు.

వైఎస్‌ జగన్‌పై కూటమి కక్ష సాధింపు చర్యలు

- మద్యం అక్రమ కేసులో ముగ్గురు విడుదల హర్షణీయం
- వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్‌): సుమారు 120 రోజుల నిర్బంధం, జ్యుడీషియల్‌ రిమాండ్‌ తర్వాత ఐఏఎస్‌ అధికారి ధనుంజయరెడ్డి, గ్రూప్‌–1 అధికారి కృష్ణమోహన్‌రెడ్డి, ప్రముఖ సీఏ గోవిందప్పలకు విజయవాడ ఏసీబీ కోర్టు బెయిల్‌ మంజూరు చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు బృందావన్‌ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దుర్మార్గమైన కేసు ఇదని అన్నారు. లిక్కర్‌లో అసలు స్కాం చేసే అవకాశం లేకపోయినా కావాలని క్రియేట్‌ చేశారని ఆరోపించారు. సిట్‌ అధికారులు రాజకీయ కక్ష తీర్చేందుకు పనిచేస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో చాలా విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. వైఎస్‌ జగన్‌పై కక్ష సాధింపు చర్యలు చేపట్టాలనే దురుద్దేశపూర్వకంగా చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిందని ఆరోపించారు. వేధింపులకు గురిచేసిన టీడీపీ ప్రభుత్వం.. తర్వాత బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

తురకపాలెం గ్రామస్తులను ఆదుకోవాలి

వైఎస్సార్‌ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్‌ ఇస్తర్ల బాబూరావు

చీరాల రూరల్‌ : గుంటూరు సమీపంలోని తురకపాలెం గ్రామస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్‌ ఇస్తర్ల బాబూరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం తన హాస్పిటల్‌ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తురకపాలెం గ్రామ సమీపంలో అనేకమంది భూమిలోకి వందల అడుగుల లోతులో బోర్లు దించి మంచినీటిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. అక్రమార్కుల చర్యలతో సమీపంలో నివాసముంటున్న తురకపాలెం గ్రామస్తులకు తమ ఇంటి బోర్లలో నీళ్లురాక నానా



ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయితే వారంతా మంచినీటికి అలమటించి కుంటల్లోని కలుషితమైన నీటిని తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. చిన్నా.. పెద్దా అనే తేడా లేకుండా నెలల వ్యవధిలోనే 48 మంది ఎస్సీ కాలనీ వాసులు చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే మంచి నీటిని అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు కాలనీ వాసులకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని, వ్యాధుల బారినపడి మృతి చెందిన వారికి నష్టపరిహారం అందించాలని డిమాండ్‌ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని విద్య

బల్లికురవ: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందిస్తారని విజయవాడ పశు సంవర్ధక శాఖ కమిషనర్‌ ఎం. శ్రీనివాసరావు, గుగూల్‌ సంస్థ రీజనల్‌ అధికారి ప్రణవి అన్నారు. రోడ్డు మార్గంలో వెళ్తూ శనివారం ఎస్‌ఎల్‌ గుడిపాడులోని సుజాతనగర్‌ కాలనీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల విద్యా బోధన విద్యార్థుల హాజరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రణవి మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఉపకార వేతనాలు అందిస్తామని.. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుంటపల్లి పార్థసారథి, ఉపాధ్యాయులు రాజశేఖర్‌, రమణ



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ కమిషనర్‌

లావణ్యను సత్కరించారు. సురక్షిత మంచినీరు అందక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న అతిథులు ఈ విద్యా సంవత్సరం వరకు పాఠశాల విద్యార్థులకు ప్రతి రోజూ అవసరమయ్యే మినరల్‌ వాటర్‌ను తాము అందజేస్తామని ప్రకటించారు. అవసమైన మొత్తాన్ని ప్రధానోపాధ్యాయునికి అందజేశారు.

నేరస్తులుగా మార్చే మత్తు పదార్థాలు

మార్టూరు: మాదక ద్రవ్యాల వినియోగం, హెచ్‌ఐవీ.. ఎయిడ్స్‌ నిర్మూలన అంశాన్ని సమాజంలోని అన్ని వర్గాల వారు సామాజిక బాధ్యతగా గుర్తించినప్పుడే వాటిని నిర్మూలించడం సాధ్య పడుతుందని బాపట్ల డీఆర్డీఏ, ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ పి. శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. మార్టూరు వెలుగు కార్యాలయంలో శనివారం మండల మీపీఓలు, గ్రూపు మహిళలు, రైతు సంఘాల నాయకులతో నిర్వహించిన అవగాహనా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం యువత చిన్న వయసులోనే మాదక ద్రవ్యాలకు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు మనో వేదనకు గురి చేస్తున్నారన్నారు. ఆరోగ్యాన్ని పోగొట్టుకోవడంతో పాటు దోపిడీలు, హత్యలు, అత్యాచారాల వంటి అసాంఘిక చర్యలకు పాల్పడుతూ నేరస్తులుగా మారుతున్నారన్నారు. సామాజిక రుగ్మతల నివారణ కోసం వ్యవస్థలు, పలు శాఖలు చర్యలు తీసుకుంటే సాధ్యపడదని, మహిళా సంఘాలు, రైతులు ప్రజాసంఘాల, నాయకులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఇతర అధికారులతో కలిసి పోస్టర్‌ ఆవిష్కరించారు. హెల్ప్‌ స్వచ్ఛంద సంస్థ పీడీ సాగర్‌, వెలుగు డీపీఎంలు రవీంద్రబాబు, సురేంద్రబాబు, మోహనరావు, ఉద్యానవన శాఖ అధికారి బి.హనుమంతు నాయక్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎం సామ్రాజ్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- పోలీస్‌ వ్యాన్‌ డ్రైవర్‌ నిర్లక్ష్యమే కారణం
- మృతులు పొన్నూరుకు చెందిన దంపతులు

బాపట్ల టౌన్‌ : పోలీస్‌ వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందగా...మరో ముగ్గురికి గాయాలైన ఘటన పట్టణ శివారులోని హెరిటేజ్‌ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లా ఏఆర్‌ విభాగంలోని పోలీస్‌ వ్యాన్‌ డ్రైవర్‌ మనోజ్‌ అవుట్‌సోర్సింగ్‌ విధానంలో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో పోలీస్‌ వ్యాన్‌ను సర్వీసింగ్‌ నిమిత్తం బాపట్ల నుంచి గుంటూరు తీసుకెళ్తున్నాడు. ఫుల్లుగా మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పట్టణంలోని మూర్తి రక్షణ నగర్‌ సమీపంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న కె. తనూష్‌సాయి, లికిత్‌బాబు, సందీప్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో వీరి ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు కేకలు వేయడంతో వాహనాన్ని



డ్రైవర్‌ మనోజ్‌



మురళి మృతదేహం



తిరుపతమ్మ (ఫైల్‌)

మరింత వేగంగా నడుపుతూ పొన్నూరు నుంచి బాపట్ల వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న దంపతులను ఢీకొట్టాడు. ఈ ఘటనలో దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను పొన్నూరు పట్టణంలోని శ్రీనగర్‌ కాలనీ, 6వ లైనుకు చెందిన కన్నటి మురళి, అతని భార్య లక్ష్మీతిరుపతమ్మగా గుర్తించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.




చికిత్స పొందుతున్న తనూష్‌ సాయి

కేజీకిపైగా గంజాయి స్వాధీనం


మంగళగిరి టౌన్‌: గంజాయి కలిగిన ఓ వ్యక్తిని శుక్రవారం అర్ధరాత్రి మంగళగిరి పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం... మంగళగిరి పట్టణానికి చెందిన వీరాంజనేయులు శుక్రవారం రాత్రి గంజాయి కలిగి ఉన్నాడనే సమాచారం పోలీసులకు అందింది. పట్టణ ఎస్‌ఐ హరిబాబు తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వీరాంజనేయులు పక్కనే ఉన్న మరో ఇద్దరు యువకులు పరారయ్యారు. ఇంట్లో సోదా చేయగా సుమారు 1.25 కేజీల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు విచారిస్తున్నారు. ఈ గంజాయి ఒడిశా నుంచి వస్తున్నట్లు ప్రాథమికంగా పోలీసులు తెలుసుకున్నారు. దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు.

నూటా నూతన కార్యవర్గం ఎన్నిక

పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీచర్స్‌ అసోసియేషన్‌ (నూటా) నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఆచార్య పండు బ్రహ్మాజీరావు, ఆచార్య ఎం.త్రిమూర్తిరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు సంబంధించిన ఉత్తర్వులను ఎలక్షన్‌ అధికారి ఆచార్య ఎస్‌.మురళీమోహన్‌ శనివారం విడుదల చేశారు. పర్యావరణ విభాగానికి చెందిన ఆచార్య పండు బ్రహ్మాజీరావు అధ్యక్షుడిగా, సోషియాలజీ, సోషల్‌ వర్క్‌ విభాగానికి చెందిన ఆచార్య ఎం.త్రిమూర్తి రావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కెమిస్ట్రీ విభాగానికి చెందిన



అధ్యక్షుడు ఆచార్య బ్రహ్మాజీ



కార్యదర్శి ఆచార్య త్రిమూర్తిరావు

ఆచార్య ఎం.సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా ఆచార్య డి.రామచంద్రన్‌, కోశాధికారిగా ఫిజిక్స్‌ విభాగానికి చెందిన ఆచార్య చేబ్రోలు లింగరాజు ఎన్నికయ్యారు. సైన్స్‌ రిప్రజెంటేటివ్‌గా టెక్నాలజీ విభాగానికి చెందిన డాక్టర్‌ బి.సుధాకర్‌, కంప్యూటర్‌ సైన్స్‌ విభాగానికి చెందిన డాక్టర్‌ కె.లావణ్య, ఆర్ట్స్‌ రిప్రజెంటేటివ్‌గా సోషియాలజీ విభాగానికి చెందిన ఆచార్య వై.అశోక్‌ కుమార్‌, మానవ వనరుల విభాగానికి చెందిన ఆచార్య వి.తులసీదాస్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్‌ ఆచార్య రత్నషీలామణి అభినందించారు.